

**ఆశలు సజీవం**

ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వృథా నీటి మళ్లింపు అంశం తెరపైకి వచ్చింది. వివరాలు 8లో ▸



**టాస్క్‌ఫోర్స్ దాడులు**

సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు దాడులను నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. వివరాలు 8లో ▸



**పన్నుల వసూలుపై నజర్**

సదాశివపేట మున్సిపాలిటీలో పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెడర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

జహీరాబాద్ టౌన్: ఆచార్య డిగ్రీ కళాశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని చెప్పారు. డిగ్రీ స్థాయి విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, నందుగౌడ్, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి



కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి

పుల్‌కల్(అందోల్): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుల్లో రాణించాలని జోగిపేట సివిల్ జడ్జి ధనలక్ష్మి సూచించారు. శనివారం మండల కేంద్రం పుల్‌కల్‌లోని ప్రభుత్వ కళాశాల, ఆదర్శ మోడల్ కళాశాల విద్యార్థులకు మహిళ, బాలిక, పోక్సో చట్టాల గురించి వివరించారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అడ్వకేట్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

సంగారెడ్డి: అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో గంజాయి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద బిహార్ రాష్ట్రానికి చెందిన లంబాడియా సింగ్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించారు. అతని నుంచి కేజీ అరవై గ్రాముల ఎండు గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### విద్యుత్ సమస్య ఉండొద్దు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ మాధవరెడ్డి

పటాన్‌చెరు టౌన్: వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈ మాధవరెడ్డి సూచించారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని విద్యుత్ కార్యాలయ ఆవరణంలో సబ్ డివిజన్ స్థాయి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు గ్రామాల్లో పర్యటించి విద్యుత్ సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ప్రజల ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈ రమేష్ చంద్ర, ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

### కొత్త స్టాఫ్‌నర్సులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

సంగారెడ్డి: విధుల్లో చేరిన 144 మంది కొత్త స్టాఫ్‌నర్సులకు సంగారెడ్డి మెడికల్ కళాశాలలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు వారికి దిశానిర్దేశం చేశారు. అలాగే 80మంది పాత నర్సులు 317 జీఓ ప్రకారం ఇతర ప్రదేశాలకు వెళ్లారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, ఆర్ఎంఓలు రవికుమార్, ఆంజనేయులు, డాక్టర్ షబ్బీర్ అలీ పాల్గొన్నారు.





# కట్టు.. బొట్టు.. అన్నీ వైవిధ్యమే

**భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా మారాయి పటాన్‌చెరు నియోజకవర్గంలోని పారిశ్రామిక వాడలు. ఇవి మినీ ఇండియాను తలపిస్తున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తుండటంతో ఒక ప్రత్యేకమైన జీవనం విధానం కనిపిస్తుంది. వారి కట్టు, బొట్టు, భాష, ఆచారాలు వైవిధ్యంగా ఉంటాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తూ స్థిర నివాసాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. వారు ఆరాధించే దేవుళ్ల ఆలయాలను కూడా నిర్మించుకుని స్థానికులతో కలిసి పండగలు, ఉత్సవాలు జరుపుకోవడం విశేషం.** - జిన్నారం(పటాన్‌చెరు)

- మినీ ఇండియాను తలపిస్తోన్న పటాన్‌చెరు పారిశ్రామిక వాడలు
- అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం
- భిన్న జాతులు, సంప్రదాయాల ఏకత్వం
- ప్రత్యేక ఆకర్షణగా దేవాలయాలు

జిల్లాలోని పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, జహీరాబాద్, హత్నూర, సుల్తాన్‌పూర్ ప్రాంతాలు పారిశ్రామిక వాడలుగా ఉన్నాయి. ఇక్కడ ఐదువేలకు పైగా వివిధ పరిశ్రమలు ఉంటాయి. వీటిల్లో పనిచేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రజలు వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. వీరంతా పారిశ్రామిక వాడల్లోనే జీవనం సాగిస్తుంటారు. వివిధ ప్రాంతాల వారు కావడంతో వీరి భాష, సంస్కృతి, సంప్రదాయాలు కూడా విభిన్నంగా ఉంటాయి.

### ప్రత్యేక ఆకర్షణగా పూరీ ఆలయం



ఒడిషాలోని పూరీలో ఉన్న జగన్నాథస్వామి ఆలయం మాదిరిగా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో నిర్మించుకున్నారు. 1990లో ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ.10కోట్లతో దేవాలయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ ఆలయానికి ఆనుకొని మరిన్ని దేవాలయాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు ఈ దేవాలయం ఓ పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గాంచింది. ప్రతి ఏటా జూన్, జులైలో పూరీ జగన్నాథస్వామి రథయాత్రను కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ సమయంలో వారం రోజులపాటు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపడుతారు.

### సూర్య భగవానుడి దేవాలయం



బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రజలు సూర్యభగవాన్‌ను పూజిస్తుంటారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ఆ రాష్ట్ర ప్రజలు సూర్యభగవాన్ దేవాలయాన్ని నిర్మించుకున్నారు. ఆలయంలో ప్రతీ సంవత్సరం చట్ పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మహిళలు ఆలయం ఎదుట ఉన్న కొలనులో స్నానాలు చేసి పూజలు చేస్తారు. కలష పూజలను కూడా నిర్వహిస్తారు. ప్రతి ఏటా వంద కలషాలతో మహిళలు మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలో పాదయాత్ర నిర్వహించి సూర్యభగవానుడికి సమర్పిస్తారు. బొంపతల్లిలో సూర్య భగవాన్ దేవాలయాన్ని నిర్మించేందుకు ఇటీవల అక్కడి నాయకులు శంకుస్థాపన చేశారు.

### స్వామివారి సన్నిధిలో జీవనం



పూరీ జగన్నాథ స్వామి ఆలయం వద్ద నివాసం ఉంటున్న. 2005లో బతుకు తెరువు కోసం ఇక్కడికి వచ్చా. స్వామివారి దేవాలయ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఇక్కడే ఉన్న. ప్రస్తుతం ఇక్కడ అర్చకునిగా కొనసాగుతున్నాను. ఈ ప్రాంతంలో ఉండటం చాలా సంతోషంగా ఉంది.

– పరాస్, ఒడిశా

### ఆనందంగా ఉంది



మా కుటుంబ సభ్యులతో కలిసి బొల్లారంకు వచ్చి పదేళ్లవుతుంది. ప్రస్తుతం ఇక్కడ సొంత ఇంట్లో నివాసం ఉంటున్నాం. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాం. ఇక్కడ చాలా సంతోషంగా ఉన్నాం. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– శ్రీదేవి, విజయనగరం, ఆంధ్రప్రదేశ్

### ఇతర ప్రాంతాల వారికి అండగా ఉంటాం



బొల్లారం మున్సిపల్ పరిధిలో 70శాతం వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా చర్యలు తీసుకుంటాం. వారికి ఇబ్బందులు వస్తే సత్వరమే పరిష్కరిస్తాం. వారి కోసం దేవాలయాలను నిర్మించేందుకు సహకరిస్తున్నాం.

– చంద్రారెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

**పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాలకు చెందిన జనాభా**

| | |
|---|---|
| ఉత్తరప్రదేశ్ : | 2లక్షలు |
| ఆంధ్రప్రదేశ్ : | 7లక్షలు |
| బిహార్ : | 2లక్షలు |
| ఒడిశా: | 2లక్షలు |
| మహారాష్ట్ర: | లక్ష |
| కర్ణాటక : | 50వేలు |
| అస్సాం: | 40వేలు |
| ఛత్తీస్‌గఢ్ : | 50వేలు |

# దర్యాప్తు ముమ్మరం

- ఎమ్మెల్యే లాస్య ప్రమాదంపై అన్ని శాఖలు ఫోకస్
- వాహన తయారీ లోపాలేమైనా ఉన్నాయా?
- పరిశీలించిన ఎంవీఐల బృందం
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ, సివిల్ ఇంజనీర్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. యాక్సిడెంట్‌కు సంబంధించిన వివరాల సేకరణలో అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే ప్రయాణించిన వాహనంలో తయారీ లోపాలేమైనా ఉన్నాయా? ఎక్స్‌ఎల్–6 వాహనం కొత్తదే అయినప్పటికీ.. ఎక్కడైనా మ్యానుఫ్యాక్చర్ డిఫెక్టులు ఏమైనా ఉన్నాయా..? అని పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి గురైనప్పుడు వాహనం గంటకు 100 కి.మీల వేగంతో ప్రయాణిస్తుందని స్పీడోమీటర్‌ను బట్టి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన అధికారులు.. అంతకంటే ఎక్కువ వేగంగా వెళ్తుందా..?, వాహనం ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయి.. విడిభాగాలు వంద మీటర్ల దూరం పడిపోవడాన్ని బట్టి చూస్తే అంతకంటే ఎక్కువ వేగంతో వాహనం ప్రయాణిస్తోందా..? ఇలా ఈ కేసులో సాంకేతిక అంశాలపై రవాణాశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

**వాహనాన్ని పరిశీలించిన ఎంవీఐల బృందం**

రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాన్ని శనివారం రవాణాశాఖ అధికారులు మరోసారి పరిశీలించారు. ముగ్గురు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల బృందం వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. అలాగే ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునే పనిలో ఉన్నారు. నిద్రమత్తు, అధిక వేగమే ప్రమాదానికి కారణమని శుక్రవారమే పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చినప్పటికీ.. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని నడుపుతున్న లాస్యనందిత పీఏ ఆకాష్ స్టేట్‌మెంట్‌ను శుక్రవారమే రికార్డు చేసిన పోలీసులు.. నిద్రమత్తు కారణమని ప్రకటించారు. అధిక వేగంతో ప్రయాణిస్తున్న వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదానికి గురైందని తెలిపారు. అయితే ప్రమాదానికి గల కారణాలను పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వనున్నారు.

**సీసీ టీవీ పుటేజీల సేకరణ**

ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పటాన్‌చెరు పోలీసులు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన చోట ఏమైనా సీసీ టీవీలు ఉన్నాయా అని పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో ఎన్ని భారీ వాహనాలు వెళ్లాయో గుర్తించారు. సుమారు ఆరు వాహనాలు వెళ్లినట్లు సీసీటీవీ పుటేజీని బట్టి గుర్తించారు.

**సివిల్ ఇంజనీర్ల బృందం..**

సివిల్ ఇంజనీర్ల బృందం కూడా సంఘటన స్థలాన్ని శనివారం పరిశీలించినట్లు సమాచారం. శుక్రవారమే ఆర్‌అండ్‌బీ అధికారులు సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించగా.. శనివారం సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన నిపుణులతో రోడ్డును పరిశీలించినట్లు తెలిసింది.



### ఆరు టిప్పర్లు వెళ్లినట్లు గుర్తింపు

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే కారు ప్రమాదం జరిగిన సమయంలో ఓఆర్‌ఆర్‌పై ఆరు టిప్పర్లు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. రోడ్డు రెండో లేన్ నుంచి రెయిలింగ్ వరకు కారు స్పేర్ పార్ట్స్ పడి ఉండటం, కారుపై రాక్ సాండ్ పొడి పడి ఉండటంతో టిప్పర్ లేదా కాంక్రీట్ లారీని ఢీకొట్టారా అనే దానిపై ఆరా తీస్తున్నారు. అలాగే డ్రైవర్ ఆకాష్ మద్యం తాగి ఉన్నాడా అనే కోణంలో కూడా వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు అతని రక్త నమూనాలను ల్యాబ్ టెస్టులకు పంపారు. ఆకాష్ సెల్ ఫోన్ వివరాలు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.22వ తేది అర్ధరాత్రి ఎమ్మెల్యే ఇంటి నుంచి రెండు కార్లు (ఫార్చునర్, సుజుకీ ఎక్సెల్ 6)లో సదాశివపేటకు వెళుతూ రాత్రి 12.50కి ముత్తంగి టోల్ గేట్ క్రాస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# ఉపాధి పనుల్లో అవకతవకలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**సామాజిక తనిఖీల్లో బట్టబయలు**

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ సదస్సు నిర్వహించారు. ఇందులో డీఆర్‌డీఓ అదనపు పీడీ బాల్‌రాజ్,విజిలెన్స్ అధికారి నాగేశ్వర్ రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ ఆనంద్ మేరీ, ఏపీఓ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, నర్సరీ ఏర్పాటులో పలు అవకతవకలు జరిగాయని సామాజిక తనిఖీలో బయట పడింది. అవకతవకలకు పాల్పడిన పలు గ్రామ పంచాయతీలకు జరిమానా విధించారు. నర్సరీలలో పెంచే మొక్కలకు పంపిణీకి, నాటిన మొక్కలకు పొంతన లేకపోవడం గమనార్హం. వేల సంఖ్యలో మొక్కలు పెంచగా గ్రామాల్లో పదుల సంఖ్యలో మొక్కలున్నాయని తనిఖీ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. మిన్‌పూర్‌లో పంచాయతీ కార్మికులతో పనులు చేయించి అప్పటి కార్యదర్శి బిల్లులు తీసుకున్నాడని తేలింది. మొక్కలు నాటడానికి గుంతలను కూలీలకు బదులు జేసీబీని ఉపయోగించారని స్పష్టమైంది. గంగోజీపేటతో పాటు పలు గ్రామ పంచాయతీలకు జరిమానా విధించారు. ప్రతి గ్రామ పంచాయతీలో సమర్పించిన నివేదికల్లో ఉపాధి సిబ్బంది చేతివాటం చూపినట్లు నిర్ధారణ అయ్యిందని అధికారులు తెలిపారు.

# రుణమాఫీపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి వెల్లడించారు. శనివారం మండలంలోని మాసాన్‌పల్లి, దేవునిపల్లిలో అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని ఆరోపించారు. సింగూరు నుంచి నీటిని తరలించి నల్లవాగు ప్రాజెక్టు నింపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ జలంధర్, మాజీ ఎంపీపీ మల్లేశం భాస్కర్‌సేట్, నరేందర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**ఖేడ్ పురపాలికకు రూ.20 కోట్లు**

నారాయణఖేడ్ : ఖేడ్ పురపాలిక పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు టీఎస్‌యూఐడీసీ ద్వారా రూ.20 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. రహదారుల మరమ్మతులు, అంగన్వాడీ భవనాలు, పాఠశాలల నిర్మాణం కోసం వీటిని ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం జిల్లాకు సంబంధించిన రూ.300 కోట్ల సీఎస్ఆర్ నిధులను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు మళ్లించి అన్యాయం చేసిందని ఆరోపించారు.

# మూడోసారి మోదీనే ప్రధాని

**కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలే**

హత్నూర(సంగారెడ్డి): ప్రపంచ దేశాల్లో భారత్‌కు గుర్తింపు తెచ్చిన నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలే అన్నారు. శనివారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో జరిగిన విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రఘునందన్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, నాగ ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

**సంగారెడ్డిలో..**

సంగారెడ్డి : లోక్‌సభలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ తలపెట్టి విజయసంకల్ప యాత్ర శనివారం పట్టణంలో ఉత్సాహంగా సాగింది. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో వారు మాట్లాడారు. ప్రజల యోగక్షేమాల కోసం నిరంతర శ్రామికుడిగా పని చేస్తున్న ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ అందరి మన్ననలు పొందుతున్నారని చెప్పారు. జాతీయ రహదారులు నిర్మించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. తప్పు చేసిన ఎంతటివారికైనా శిక్ష పడేలా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి ఒంటరిగా 17 స్థానాల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే అనడం హాస్యాస్పదమన్నారు. జగ్గారెడ్డి ప్రజలను బహిష్కరించానని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో చిక్కుకున్న కేసీఆర్ బిడ్డ కవితకు శిక్ష పడటం ఖాయమన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి బస్వ లక్ష్మి నర్సయ్య, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పులిమామిడి రాజు, దారం గురువారెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, సంగప్ప, కొండాపురం జగన్, సురేందర్, చంద్రశేఖర్, అంజిరెడ్డి, దోమల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ చౌరస్తాలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలే

### కేతకీ జాతరకు అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రిని పురస్కరించుకుని కేతకీ సంగమేశ్వర ఆలయ జాతరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని ఆర్డీఓ ఎస్.రాజు ఆదేశించారు. శనివారం కేతకి ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తాగునీరు, క్యూలైన్లు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయానికి వచ్చే ప్రధాన రహదారులు బాగు చేయాలన్నారు. జాతర సమయంలో జహీరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీపీ దేవదాసు, జెడ్పీటీసీ సభ్యురాలు వినీలా నరేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పటేల్, ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశం, అధికారులు శివరాజ్, శశిధర్, సుధాకర్, సంజీవ రావు, రాజేందర్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



జిన్నారంలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అనిత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు కార్యదర్శులు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ అనిత ఆదేశించారు. శనివారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామాలలో పల్లె ప్రకృతివనాలు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకాన్ని సక్రమంగా చేపట్టాలన్నారు.

## క్లుప్తంగా

### విద్యార్థిని ప్రతిభ



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో మిర్జాపూర్(బి) జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సాదియనౌసేన్ ప్రతిభ కనబర్చింది. ఎఫ్‌పీఎస్‌టీ, టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును శనివారం నిర్వహించారు. అందులో జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా మిర్జాపూర్(బి)పాఠశాలకు చెందిన సాదియానౌసేన్ మూడో స్థానం పొందింది. విద్యార్థినికి డీఈఓ వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రం, సర్టిఫికెట్‌ను అందజేశారు.

### సైబర్ మోసం

**రూ.24.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు**

సిద్దిపేటకమాన్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరిట వచ్చిన లింకులో భారీగా పెట్టుబడి పెట్టి వ్యక్తి మోసపోయాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసు కమిషనర్ అనురాధ కథనం ప్రకారం.. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించిన లింకును పంపించాడు. అందులో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆ లింకును ఓపెన్ చేసి బాధితుడు.. మొదటగా పెట్టుబడి పెట్టగా లాభాలొచ్చాయి. అదే విధంగా పలు విడతలుగా మొత్తం రూ.24,80,500 ఆన్‌లైన్‌లో పంపాడు. తర్వాత ఆ లింకు ఓపెన్ చేస్తే బ్లాక్ చేసినట్లు మెసేజ్ కనిపించింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు జాతీయ నంబర్ 1930లో ఫిర్యాదు చేశాడు.

# అరుణ వర్ణ శోభితం

సంగారెడ్డి చెరువు కట్ట పై సూర్యాస్తమయ సమయంలో సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశం సైతం అరుణ వర్ణంలోకి మారిపోయింది. చెరువు ఆవరణంతా కాన్వాస్ పై గీసిన ప్రకృతి చిత్రంలా కానవస్తుంది. సూర్యుడిని మొక్కల మీదుగా చూస్తే వాటికి కాచిన పండులా అందంగా కనిపించాడు. సాయంత్రం వాకింగ్‌కు వచ్చిన వారంతా ఈ ఆహ్లాద దృశ్యాన్ని చూసి మైమరచిపోయారు. యువతులు సెల్ఫీలు దిగడం కనిపించింది.

– బి. శివ ప్రసాద్,
సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్,
సంగారెడ్డి.









# ఆశలు సజీవం

- తెరపైకి నల్లవాగు వృథా నీటి మళ్లింపు
- రూ.280 కోట్లతో ప్రతిపాదనలు
- నిజాంసాగర్ ప్రాజెక్టు వరకు కాల్వ నిర్మాణం
- ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రస్తావన
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్న



నల్లవాగు ప్రాజెక్టు అలుగుపై నుంచి వృథాగా పారుతున్న నీరు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వృథా నీటి మళ్లింపు అంశం తెరపైకి వచ్చింది. ఆ జలాలను సద్వినియోగం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు ఇటీవల రూ.280 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. వర్షాకాలంలో ప్రాజెక్టు నిండిన ప్రతి యేటా 2 టీఎంసీల వరకు నీరు వృథాగా వెళ్లి మంజీరా నది నుంచి గోదావరిలో కలుస్తుంది. ప్రాజెక్టు అలుగుపై నుంచి వృథాగా పారుతున్న నీటిని అడ్డుకట్ట వేసి చెరువులు, కుంటలు, మిగతా నీటిని కామారెడ్డి జిల్లా పరిధిలోని నిజాంసాగర్ ప్రాజెక్టులో తరలించేందుకు అక్కడి వరకు కొత్తగా కాల్వ నిర్మాణం చేయాలనేది ప్రధాన లక్ష్యం.

**మహానేత వైఎస్సార్ హయాంలో ఆలోచన**

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాం 2008–09లో ఈ వృథా నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మళ్లింపు పనులు చేపట్టాలనే ఆలోచనకు బీజం పడింది. అప్పట్లో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. నల్లవాగు ప్రాజెక్టు నుంచి సిర్గాపూర్ మండలం ఖాజాపూర్, కల్హేర్ మండలం ఖానాపూర్(కె), కృష్ణాపూర్, అలీఖాన్‌పల్లి, రాపర్తి, మీర్ఖాన్‌పేట, బాచేపల్లి గ్రామల మీదుగా కాల్వ నిర్మాణం చేపట్టి నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారు. అప్పట్లో అధికారులు సర్వే చేశారు. రూ. 80 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. నిధులు మంజూరు దశలో వైఎస్సార్ మరణంతో బ్రేక్ పడింది.

**తాత్కాలిక అంచనాలు**

నల్లవాగు వృథా నీటిని మళ్లింపు పనులు చేపట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిను కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యయంపై అంచనాలు రూపొందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు సర్వే చేసి తాత్కాలికంగా రూ. 280 కోట్లతో ప్రదిపాదనలు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తిరిగి ప్రస్తవించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు అధికారంలో ఉండటంతో వృథా నీటి మళ్లింపు పనులు జరిగితే మరో 2 వేల ఎకరాల పైగా ఆయకట్టు భూములకు మోక్షం లభించే అవకాశం ఉంది.

**సీఎంఓ ఆఫీస్‌లో ఫైల్**



నల్లవాగు వృథా నీటి మళ్లింపు పనులకు సంబంధించిన ప్రతిపాదనల ఫైల్ సీఎంఓ కార్యాలయానికి చేరింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వరద కాల్వ పనులు చేయకుండా గతంలో బీఆర్ఎస్ ప్రభు త్వం పక్కన పెట్టేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేయకుండా విస్మరించారు. మెడిగడ్డ ప్రాజెక్టు కృంగిపోవడంతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులకు ఆటంకం ఏర్పాడింది. సింగూరు ప్రాజెక్టు నుంచి నల్లవాగు నింపేందుకు, నియోజకవర్గంలో సాగు నీటి సమస్య తీర్చేందుకు సంగమేశ్వర, బసవేశ్వర పనుల కోసం కృషి చేస్తున్నాం. రైతులకు సాగు నీరు అందించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం.

–పి.సంజీవరెడ్డి, ఎమ్మెల్యే నారాయణఖేడ్



నల్లవాగు ప్రాజెక్టు

# పల్స్ పోలియోకు సమాయత్తం

**అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ, 4వ, 5వ తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్‌తో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 3న బూత్ యాక్టివిటీ, 4, 5వ తేదీల్లో హౌస్ టు హౌస్ యాక్టివిటీ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,96,352 గృహాలను సందర్శించి 0–5 సంవత్సరాల వయస్సు ఉన్న 82,075 మంది పిల్లలకు చుక్కలు వేయాలన్నారు. 717 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 306 హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించామని, 37 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బస్టాండ్లు, మార్కెట్లలో 20 బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను ఇమ్యూనైజ్ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు 122 సూపర్‌వైజర్, 2,977 వ్యాక్సినేటర్లను నియమించినట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి మార్చి 5వ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పవర్ కటింగ్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యవేక్షణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ విజయరాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిని, డిప్యూటీ డీఎంహెచ్ఓలు మల్లేశ్వరి, ప్రభాకర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి , డీడబ్ల్యూఓ సావిత్రి, మున్సిపాలిటీల కమిషనర్లు, విద్యుత్, రవాణా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాష్టాంగ నమస్కార సాధువుకు సన్మానం

**11 నెలల్లో 5 వేల కిలోమీటర్ల యాత్ర పూర్తి**



సాధువును సన్మానించిన గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సాష్టాంగ నమస్కారం చేస్తూ సాధువు రాజగిరి మహదేవ్ చేపట్టిన యాత్ర శనివారం కుకునూరుపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, నాయకులు ఉప్పల పాండు, రాజులతో పాటు గ్రామస్తులు.. యాత్రకు ఘనస్వాగతం పలికారు. మహదేవ్‌కు పండ్లను ఇచ్చి రూ. 3వేలను అందజేశారు. ఈ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని కరోలి జిల్లాకు చెందిన ఆయన ఇప్పటి వరకు 11 నెలలుగా సాష్టాంగ నమస్కారాలు చేస్తూ 5 వేల కిలోమీటర్ల దూరం పూర్తి చేశారు. మరో 1,150 కిలోమీటర్ల దూరం వరకు సుమారు 6 నెలల కాలం పడుతుందని సాధువు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎండలు ముదిరిన తరుణంలో కాలినడకన వెళ్లడమే కష్టమన్నారు. అలాంటిది ఇన్ని కిలోమీటర్ల మేర సాష్టాంగ నమస్కారాలు చేస్తూ యాత్రను చేపట్టడం సామాన్య మానవులకు సాధ్యం కాదన్నారు.

# చదువును ఇష్టంగా స్వీకరించాలి

**గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల**



విద్య ప్రాముఖ్యాన్ని వివరిస్తున్న నిర్మల

కొండపాక(గజ్వేల్): చదువుకోవడం కష్టమనుకోకుండా ఇష్టంగా స్వీకరించాలని గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలో గల గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో మమేకమై.. విద్యాపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను వదిలిపెట్టి విద్య కోసం ఇక్కడికి విద్యార్థులు వస్తున్నారని, మదిలోకి వారు రాకుండా మంచి బోధనను ఉపాధ్యాయులు అందించాలన్నారు. విద్యార్థులు పరిజ్ఞానం పెరిగేలా ప్రాక్టీస్‌లా స్వీకరిస్తూ చదువుకోవాలన్నారు. వారు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అయితే మానకొండూర్ నియోజకవర్గంలోని అన్నారం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కిష్టారెడ్డిని.. పాఠశాలలో మినీ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ వెంకటరమణాచారి కోరగా రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేస్తే దాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిట్యాల నర్సింహులు, ఉపాధ్యాయులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# తాత అంత్యక్రియలకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొన్న లారీ
- మనవడి మృతి, మరో తాత, నాయనమ్మకు తీవ్రగాయాలు



గొల్లపల్లి సాత్విక్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): మరో తాత అంత్యక్రియలకు తాత, నాయనమ్మలతో కలిసి మనవడు బైక్‌పై బయలుదేరగా.. మార్గమధ్యలో లారీ రూపంలో మృతువు కబళించింది. ఈ ప్రమాదంలో మనుమడు మృతిచెందాడు. వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్లలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన సాత్విక్(15), నాయనమ్మ, తాత గొల్లపల్లి రాములు, లక్ష్మితో కలిసి.. మరో తాత (తల్లి తండ్రి) అంత్యక్రియల నిమిత్తం బైక్‌పై బయలుదేరారు. వారు ప్రయా ణిస్తున్న వాహనం నాగిరెడ్డిపల్లి వద్దకు రాగానే సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే సాత్విక్ మృతిచెందాడు. మెరుగైన వైద్యం కోసం రాములను వంటిమామిడిలో గల ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి.. గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అయితే జగదేవ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి వచ్చిన సాత్విక్ గంటలోపే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు, తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ జహరుల్‌హక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## సపర్యలు చేసేందుకు వచ్చి శవమై..


- అనుమానాస్పదస్థితిలో భార్య మృతి
- భర్తే హత్య చేశాడని తండ్రి ఫిర్యాదు



నాగమణి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): గాయపడ్డ భర్తకు సపర్యలు చేసేందుకు వచ్చిన భార్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖాల్సాలో శనివారం జరిగింది. రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండగల్ల కృష్ణ, నాగమణి(36) భార్యాభర్తలు. వారికి సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ సంతానం. పెళ్లి తరువాత కొంతకాలానికే భర్త తాగుడుకు బానిసై ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. దీంతో ఏడాది క్రితం తండ్రి సిరసాధుల అర్జున్ .. కుమార్తె నాగమణిని, మనవళ్లను వెంటబెట్టుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లాల్‌గాడి మలక్‌పేటలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇటీవల భర్త బైక్‌పై నుంచి పడి గాయపడ్డాడని తెలుసుకొని చూసుకునేందుకు ఫిబ్రవరి 5న తున్కిఖాల్సాకి ఆమె వచ్చింది. శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా తాగిన మత్తులో కొట్టాడని పెద్దకొడుకుకు ఫోన్ చేసి చెప్పింది. శనివారం తెల్లవారుజామున శవమై ఇంటి ఎదుట పడి ఉంది. మెడ, కుడిచెవికి గాయాలున్నాయని తెలిసింది. స్థానికులు మృతిచెందిన విషయాన్ని కుటుంబీకులకు సమాచారం అందించగా వారొచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కూతురును అల్లుడే హత్య చేశాడని మృతురాలి తండ్రి సిరసాధుల అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి



నరేష్ (ఫైల్)

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలం సంగ్యా తండాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కెతావత్ నరేష్(23) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు ఒకరోజు.. తండాలో విద్యుత్ దీపాలను అమర్చే పనిని ఒప్పుకున్నాడు. ఆ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా ఆపి స్తంభం ఎక్కి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైన ఉన్న 11 కేవీ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోకుండా స్తంభాలు ఎక్కించి అతడి మృతికి అధికారులు కారణమయ్యారని కుటుంబసభ్యులు ఆరోపించారు. తండ్రి కెతావత్ పద్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తుక్కయ్య తెలిపారు.

# మహ్మదాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- 14.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం
- అదుపులో నిందితులు



నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న టాస్క్ ఫోర్స్, పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: మహ్మదాపూర్‌లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు మహ్మదాపూర్‌లోని ముక్కెర మల్లయ్య ఇంటిపై శనివారం దాడులు చేసి 50 కిలోల బ్యాగులు 29 స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న హన్మకొండ జిల్లా వేలేరు వాసి సురేష్, గాగిరెడ్డిపల్లి వాసి సతీష్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విత్తనాల విలువ రూ.35 లక్షల ఉంటుందని, వీటిని వచ్చే వానాకాలం సీజన్‌లో కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ ప్రాంత రైతులకు విక్రయించేందుకు ముఠా సభ్యులు పథకం వేసుకున్నారని ఎస్ఐ మహేశ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైన నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన ఎరువులు అమ్మినట్లు అయితే టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 87126–67447, 87126–67446 నంబర్లలో సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అయితే ఎరువు దుకాణంలో ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాపారులు లాభాల కోసం అడ్డదారుల్లో వెళ్లి రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యువతి ప్రేమించడం లేదని ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: యువతి ప్రేమించడం లేదని మనస్థాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్తిక్ బర్మాన్(22) బతుకుదెరువు కోసం మూడున్నర నెలల క్రితం పటాన్‌చెరుకొచ్చి గౌతంనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇక్కడే ఉంటున్న వీరి గ్రామస్తుడు బోనమాలి బర్మాన్ వద్ద పనికి కుదిరాడు. రోజూ మాదిరిగానే 23న ఉదయం షాపునకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు రూమ్‌కు వచ్చాడు. అదే రోజు రాత్రి 11 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బోనమాలి.. అతడి కోసం స్థానికంగా చుట్టుపక్కల వెతుకుతుండగా శనివారం తెల్లవారుజాము షాపునకు సమీపంలో ఒక చెట్టుకు బెల్టుతో ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. యువతి తనను ప్రేమించడం లేదని మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని బోనమాలి.. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సంకల్ప సభ వద్ద గంజాయి కలకలం..?

నర్సాపూర్: బీజేపీ సంకల్ప సభ సమీపంలో గంజాయి అమ్మారని కలకలం చెలరేగింది. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో సభ ఏర్పాటు చేశారు. సభలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా పాల్గొన్నారు. సభా వేదిక వెనుక భాగాన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడని కలకలం రేగింది. పలువురు స్థానిక యువకులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దౌల్తాబాద్‌కు చెందిన వాసిగా గుర్తించారు.

ఈ విషయమై స్థానిక ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా సభ ఏరియాలో గంజాయి అమ్మినట్లు తమ దృష్టికి రాలేదని, సభ వేదిక సమీపంలో ఓ యువకుడు న్యూసెన్స్ చేయడంతో అతడిని అక్కడి నుంచి పక్కకు తీసుకు వెళ్లారని చెప్పారు.